పెరిగిన ఉపాధి వేతనం .. కూలీలకు వరం





చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు

- రోజు వారీ కూలి రూ.300 పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

మడకశిరరూరల్: వలస నివారణతో పాటు గ్రామీణుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరించేందుకు ఉపాధి హామీ పథకం ఎంతగానో దోహదపడుతోంది. ఈ పథకం కింద చెల్లించే వేతనం రూ.300 పెంపుతో కూలీలకు మరింతగా మేలు చేకూరుతోంది. గ్రామాల్లో గతం కంటే మిన్నగా ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 4 వేల మందికి పైగా కూలీలు పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

రూ.250 నుంచి రూ.300కు పెంపు

ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు రోజువారీగా కూలి రూ.250 ఉండేది. ఇప్పుడు ఆ వేతనాన్ని రూ.300కు పెంచారు. కూలీలు చేసిన పనిని బట్టి వేతనం చెల్లింపులు చేస్తున్నారు. పెరిగిన వేతనంపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతం కంటే ప్రస్తుతం పనులకు వచ్చే వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతోంది. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు గ్రామంలోనే చేతి నిండా పని దొరుకుతుండటంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధి కూడా మెరుగుపడుతోంది. రైతుల పొలాల్లో ట్రెంచ్‌లు, చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు చేపట్టంతో రైతులకు ఎంతో అనుకూలంగా మారింది.

చాలా ఉపయోగంగా ఉంది



ఉపాధి హామీ పథకం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది. గతం కంటే ఇప్పుడు రోజు వారీ వేతనం రూ.300 పెంచడంతో ఎంతో సంతోషంగా ఉంది. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మా గ్రామంలోనే ఉపయోగపడే ఉపాధి పనులు కల్పిస్తున్నారు. చేసిన పనికి ఆలస్యం కాకుండా బిల్లులు చెల్లిస్తున్నారు.

– నాగేంద్ర, ఉపాధి కూలీ, మడకశిర మండలం

గ్రామస్థాయిలోనే పనులు



ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోనే కూలీలకు పనులు కల్పిస్తున్నాం. రైతులకు ఉపయోగపడే పనులను చేయిస్తున్నాం. గత ఏడాది అమృత్ సరోవర్ కింద చెరువులు, కుంటలో పూడికతీత పనులు చేపట్టి భూగర్భజలాల పెంపుకు చర్యలు చేపట్టాం. ఈ ఏడాది కూడా పలు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాం. రోజుకు సుమారు 4 వేల మంది కూలీలకు పని కల్పిస్తున్నాం.

– శ్రీకాంత్‌గౌడ్, ఏపీఓ, మడకశిర మండలం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకి 478 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం తొలుత లెక్కించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు 478 లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌కు 339 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజుకు 722 ఓట్లు లభించాయి. ఈ ఓట్లలో టీడీపీకి 244 ఆధిక్యత లభించింది.

ప్రశాంతంగా కౌంటింగ్



బిట్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

హిందూపురం టౌన్: మండల పరిధిలోని బిట్ కళాశాలలో జరిగిన హిందూపురం, మడకశిర, పెనుకొండ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగింది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. కొట్నూరు వద్ద నుంచి కౌంటింగ్ కేంద్రం వైపు ఎలాంటి వాహనాలను అధికారులు అనుమతించలేదు. అధికారులు పాసులు ఇచ్చిన వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన బందోబస్తుతో ప్రశాంతంగా ఎన్నికలు జరగడంతో అధికారులు, పోలీసులు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

అడుగడుగునా పోలీసుల తనిఖీలు

హిందూపురం అర్బన్: ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి అలర్లు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. ఎక్కడా నలుగురు కలిసి తిరగడం, గుంపులుగా చేరకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. హిందూపురం పట్టణంలో అడుగడుగునా పోలీసులు పహారా కాశారు. దీంతో పట్టణంలో నిర్మానుష్య వాతావరణం నెలకొంది. ఎన్నికల ఫలితాలు వస్తున్నకొద్దీ కొందరు బయటకు వచ్చి సంబరాలు చేసుకునేందుకు సిద్ధపడగా పోలీసులు అడ్డుకున్నారు.

నాగదేవతలకు ప్రత్యేక పూజలు



నాగదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ తదితరులు నాగులకట్ట వద్ద నాగదేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పంచలింగ సహిత నాగదేవత విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. భక్తులు భక్తిప్రపత్తులతో నాగదేవతలను పూజించారు. సుబ్రహ్మణ్యం స్వామికి అర్చన, నివేదన గావించారు. మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భాస్కర్ (53) కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే సోమవారం రాత్రి మిద్దెపై నిద్రించిన భాస్కర్ మంగళవారం తెల్లవారుజామున మిద్దెపై నుంచి వచ్చి ఇంట్లో నిద్రించాడు. అయితే గుండె భాగంలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ఆసుపత్రికి తరలించే లోపే ఇంటి వద్దే మృతి చెందాడు. మృతుడికి భార్య కాంతమ్మ కుమారులు రజిత్ భార్గవ్, ప్రశాంత భార్గవ్ ఉన్నారు.

వజ్రకరూరులో భారీ వర్షం



వజ్రకరూరులో భారీవర్షం కురుస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన వర్షం గంటకుపైగా కురిసింది. భారీవర్షం కురవడంతో కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. కాలనీలగుండా వచ్చే వర్షపునీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంట వైపు ప్రవహించింది. వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరగనున్నాయి. భారీ వర్షం కురవడంతో వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ రావడంతో రైతులు వేరుశనగ పంటతోపాటు ఆముదం, కంది తదితర పంటలను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి మంచి దిగుబడులు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- ఓడినా కార్యకర్తలకు అందుబాటులో ఉంటా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



మడకశిర: తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఓడినా కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటమితో కుంగిపోవద్దన్నారు. అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. తన గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 4 నెలల పాటు కష్టపడి పనిచేశారన్నారు. జీవితాంతం పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తనకు మద్దతు పలికిన ఓటర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. జీవితాంతం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే నడుస్తానన్నారు. నియోజకవర్గంలో ఇక నుంచి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తద్వారా పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఎలాంటి నిబంధనలు విధించకుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా రాణించాలని ఏపీ హైకోర్ట్ జీపీ అశ్వర్థనారాయణ అన్నారు. మంగళవారం ఎస్‌డీజీఎస్ కళాశాల మైదానంలో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో గల నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్ట్ జీపీ అశ్వర్థనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధి కోసం ఎస్‌డీజీఎస్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని కొనియాడారు. హిందూపురం నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులు పాల్గొనే అవకాశాలు ఇప్పుడు చాలా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. గత ఏడాదిలో శ్రీ సత్య సాయి జిల్లా నుంచి మొత్తం 16 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనారని గుర్తు చేశారు. క్రీడాకారుల అభివృద్ధికి తమ వంతు సహాయం ఎల్లప్పుడు ఉంటుందని తెలియజేశారు. అనంతరం క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ క్లబ్ ఎండీ శేఖర్, వ్యాయమ ఉపాధ్యాయలు రామాంజినేయులు, మహేశ్ దీపక్, డాక్టర్స్ సాదీన్, కిశోర్, యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ మహమ్మద్ సలీమ్, కోచ్‌లు అయిషా, మేఘన, కృష్ణవేణి, శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

'పురం' ఎమ్మెల్యేగా మరోసారి బాలకృష్ణ



బాలకృష్ణ గెలుపొందినట్లు డిక్లరేషన్ ఫారాన్ని టీడీపీ నాయకులకు అందిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం: హిందూపురం నియోజకవర్గం ప్రజలు తిరిగి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణకే పట్టం కట్టారు. మొత్తం 19 రౌండ్లుగా జరిగిన కౌంటింగ్‌లో టీడీపీ అభ్యర్థి బాలకృష్ణకు మొత్తం ఓట్లు 1,05,778, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్.దీపికకు 74,176 వచ్చాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి ఇనాయతుల్లాకు 8,894, ఇండిపెండెంట్ అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి 1475, బీఎస్పీ శ్రీరాములు 644, నోటా 1676 ఓట్లు వచ్చాయి. హిందూపురం నియోజకవర్గం ఎన్నికల ఓట్ల కౌంటింగ్ స్థానిక బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగింది. పోస్టల్ బ్యాలెట్‌లో వైఎస్సార్‌సీపీకి 477 ఓట్లు, టీడీపీకి 1472, కాంగ్రెస్ పార్టీకి 64 ఓట్లు వచ్చాయి. అనంతరం 9.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తమైన లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. మొదట టీడీపీ అభ్యర్థి బాలకృష్ణకు 1994 ఓట్లు మెజార్టీ వచ్చింది. 9వ రౌండ్ ముగిసేసరికి టీడీపీకి 5,253 ఓట్లు నమోదు కాగా వైఎస్సార్‌సీపీకి 5,775 ఓట్లు వచ్చాయి. ఆ రౌండ్‌లో టీడీపీకి 520 ఓట్ల మెజార్టీ మాత్రమే వచ్చింది. తర్వాత నుంచి వరుసగా టీడీపీకే మెజార్టీ పెరిగింది. 19వ రౌండ్ ముగిసే సరికి మొత్తం ఓట్లులో 32,597 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ గెలుపొందారు.

మడకశిరలో 11 మంది డిపాజిట్ల గల్లంతు

మడకశిర: మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి 13 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో 11 మంది తమ డిపాజిట్లను కోల్పోయారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ తరుపున ఈరలక్కప్ప, టీడీపీ తరుపున ఎంఎస్ రాజు, కాంగ్రెస్ తరుపున సుధాకర్ పోటీ చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులకు మాత్రమే డిపాజిట్ దక్కింది. కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్ డిపాజిట్ కోల్పోయారు. మిగిలిన 10 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.

అభ్యర్థి పేరు	పార్టీ పేరు	వచ్చిన ఓట్లు
ఈరలక్కప్ప	వైఎస్సార్‌సీపీ	79,632
ఎంఎస్‌రాజు	టీడీపీ	79,983
సుధాకర్	కాంగ్రెస్	17,380
ఇందివర్	బీఎస్పీ	3,746
హనుమంతరాజు	రాడికల్స్‌పార్టీ ఆఫ్ ఇండియా	275
కరినింగప్ప	స్వతంత్ర	103
గురుమూర్తి	స్వతంత్ర	128
ధనరాజు	స్వతంత్ర	865
పవిత్ర	స్వతంత్ర	300
రవీంద్ర	స్వతంత్ర	114
రాజన్న	స్వతంత్ర	166
లక్ష్మీనరసప్ప	స్వతంత్ర	310
జగన్నాథప్రసాద్	స్వతంత్ర	408
నోటా	2,728	

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరించి మహా మంగళారతి ఇచ్చారు. అమ్మవారికి విశేష పూజ రోజు కావడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పలువురు మహిళలు ఆలయ సమీపంలోని పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజను చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు మహా మంగళారతి ఇచ్చి తీర్థప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పావగడ: ఆరోగ్యం, ఆరోగ్యకర జీవనంతో పాటు భావితరాలను రక్షించడం కోసం పొగాకు రహిత సమాజాన్ని అందరూ కలసికట్టుగా నిర్మించాలని స్థానిక శ్రీక్షేత్ర ధర్మస్థలం గ్రామాభివృద్ధి సంఘం తాలూకా యోజనాధికారి మహేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, సంఘ సంస్థలు దేశ వ్యాప్తంగా పొగాకు నిర్మూలనకు వివిధ అభియాన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో సైతం పొగాకు నియంత్రణపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకూ తెలియజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుడేన్‌బాబు, ప్రిన్సిపాల్ వినయ్‌బాబు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యం చెడిపోతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



శ్రీరంగరాజుపల్లిలో జెండాలతో గుమిగూడిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

పరిగి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మంగళవారం విడుదల అయిన ఫలితాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను టీడీపీ, జనసేన శ్రేణులు ఉల్లంఘిచాయి. ఎన్నికల కోడ్ ముగిసే వరకూ ఎక్కడేగానీ రాజకీయ పార్టీలకు విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకూడదని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను టీడీపీ, జనసేన పార్టీలు తుంగలో తొక్కాయి. పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా సవితమ్మ విజయం సాధించడంతో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పరిగి మండలంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ ర్యాలీలు, టపాసులు కాల్చారు. ప్రధానంగా శ్రీరంగరాజుపల్లిలో అత్యుత్సాహంతో ఆయా పార్టీలకు చెందిన పార్టీ నేతలు, నాయకులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీని చేపట్టారు. అదేవిధంగా అనుమతుల్లేకుండా జెండాలతో అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం ప్రజలను విస్మయానికి గురి చేసింది. అంతే కాకుండా టపాసుల మోత మోగించారు.

చిత్రదుర్గం ఎంపీగా గోవింద కారజోళ



పావగడ: చిత్రదుర్గం ఎంపీగా ఎన్డీఏ అభ్యర్థి గోవింద కారజోళ విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. విజేత గోవింద కారజోళ తన సమీప ప్రత్యర్థి ఇండియా కూటమి అభ్యర్థి బీఎన్ చంద్రప్పపై 14,673 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పావగడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కారజోళకు 75,792 ఓట్లు పోలు కాగా చంద్రప్పకు 61,119 ఓట్లు పడ్డాయి. కారజోళ విజయం సాధించడంపై స్థానిక మాజీ ఎమ్మెల్యే , జేడీఎస్ నేత కేఎం తిమ్మరాయప్ప, బీజేపీ తాలూకా అధ్యక్షుడు రంగణ్ణ, సీనియర్ బీజేపీ నేత శివప్రసాద్, జేడీఎస్ నాయకులు తిమ్మారెడ్డి, ఆర్సి అంజినప్ప, గంగాధరనాయుడు, దేవరాజ్ తదితరులు హర్షం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లేపాక్షి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ 33/11 కేవీలో అత్యవసర మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చోళసముద్రం, బసవనపల్లి, నాయనిపల్లి, కుర్లపల్లి, లేపాక్షి, నవోదయ , కంచిసముద్రం, బింగిపల్లి ఫీడర్స్ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సొంత గ్రామంలో ఈరలక్కప్పకు మెజార్టీ

మడకశిర: మడకశిర వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పను సొంత గ్రామ ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఈరలక్కప్ప సొంత గ్రామమైన గుడిబండ మండలం ఫళారం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ లభించింది. ఈ గ్రామంలో వైఎస్సార్‌సీపీకి 286 ఓట్ల మెజార్టీ లభించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు 568 ఓట్లు, టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజుకు 286 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌కు 48 ఓట్లు వచ్చాయి. తన సొంత గ్రామంలో ఈరలక్కప్పకు 282 ఓట్ల మెజార్టీ లభించింది.

గంగులవాయిపాళ్యం పంచాయతీలో కాంగ్రెస్‌కు ...

మాజీ రఘువీరారెడ్డి సొంత గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌కు 200 ఓట్ల మెజార్టీ లభించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు రెండో స్థానంలో ఉండగా...టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజుకు మూడో స్థానం లభించింది. కాంగ్రెస్‌కు 728, వైఎస్సార్‌సీపీకి 528, టీడీపీకి 367 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో 66 గ్రామ పంచాయతీలు ఉండగా.... ఇందులో గంగులపాళ్యం పంచాయతీలో మాత్రం కాంగ్రెస్‌కు మెజార్టీ లభించింది.

రోడ్లన్నీ నిర్మానుష్యం



పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారిన దృశ్యం

హిందూపురం టౌన్: ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలో మే 13న సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరగ్గా మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందని, హిందూపురంలో ఏ పార్టీ గెలుస్తుందని వెయ్యి కళ్లతో ఆత్రుతగా ఎదురు చూసిన ప్రజలకు మంగళవారం ఫలితాలు వెల్లువడే రోజు ఇళ్లలో టీవీలకు అతుక్కుపోయారు. ఉదయం 6 గంటల నుంచే టీవీల్లో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణలు మొదలవ్వడంతో ప్రజలు పనులన్నీ పక్కన పెట్టి టీవీల ముందు, స్మార్ట్‌ఫోన్లలో ఎన్నికల ఫలితాల అప్‌డేట్‌ల కోసం మునిగిపోయారు. దీంతో పట్టణంలో నిత్యం రద్దీతో నిండిపోయే రహదారులు జనాలు లేక బోసిపోయాయి. ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారిపోయాయి. హిందూపురంలోని బిట్ కళాశాల, లేపాక్షి సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లాకు సంబంధించి నియోజకవర్గాల కౌంటింగ్ జరగడంతో ఇతర ప్రాంతాల నుంచి హిందూపురానికి వచ్చిన రాజకీయ నాయకులు సైతం లాడ్జిల్లోనే టీవీలకు పరిమితమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, పోలీసుల ఆంక్షలతో ప్రజలు బయటకు రాలేకపోయారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రామచంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. జడ్ వీరారెడ్డి కాలనీకి చెందిన ఆయన బైక్‌లో గుంతకల్లు రోడ్డు బ్రిడ్జి వద్దకు బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.



మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిరరూరల్: మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. దీంతో ఖరీఫ్ పంట సాగు చేసుకోవడానికి, భూములను దున్ని దుక్కి చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. బోరు బావుల కింద సాగు చేసిన వివిధ రకాల పంటలను మరింతగా అనుకూలంగా ఉందన్నారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి



తాడిపత్రిలో బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

తాడిపత్రి అర్బన్: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్నేహ భారతి సంగీత శిక్షణాయలంలో నిర్వాహకుడు మహేష్‌స్వామి ఆధ్వర్యంలో ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో బాలు యుగం స్వర్ణయుగమని, ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యన్నారు. అనంతరం ఎస్పీ బాలు పాడిన కొన్ని సినీ గీతాలను అభిమానలు ఆలపించి ఆయన జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు దర్భ మహేశ్వరశర్మ, గోపినాథ్, నాయుడు, బాలస్వామి, శివ, బాలు అభిమానులు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. బాలు పడిన పాటలు సూర్య చంద్రులున్నంత కాలం ప్రజల మనుస్సుల్లో ఉండిపోతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఈఓ రాముడు, జీఎంపీ చలపతి, బడేసాబ్ పాల్గొన్నారు.